క్లుప్తంగా

పుంగనూరు లయన్స్ క్లబ్‌కు 12 అవార్డులు



అవార్డులతో లయన్స్ క్లబ్ ప్రతినిధులు డాక్టర్ శివ, త్రిమూర్తిరెడ్డి

పుంగనూరు: పుంగనూరు లయన్స్ క్లబ్‌కు 12 అవార్డులు లభించినట్లు జిల్లా గవర్నర్ డాక్టర్ శివ మంగళవారం తెలిపారు. క్లబ్ అధ్యక్షుడు త్రిమూర్తిరెడ్డి ప్రతినిధులను ఆయన అభినందించారు. డాక్టర్ శివ మాట్లాడుతూ, ఈ పర్యాయం క్లబ్ ద్వారా అన్నదానం, క్లాత్ బ్యాంకింగ్, పర్యావరణం, ప్లాంటేషన్, బ్లడ్‌బ్యాంక్, డయాలసిస్, వైద్య శిబిరాలు, యూత్ ఎంపవర్‌మెంట్, చైల్డ్ అండ్ ఉమెన్ అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమాలకు 12 అవార్డులు లభించినట్లు చెప్పారు. క్లబ్ ద్వారా మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు వరదారెడ్డి, సురేష్, రజి అహమ్మద్, మహేంద్రరావు, కేశవరెడ్డి, శ్రీరాములు, గోపాలకృష్ణ, రఘుపతి, కృష్ణమూర్తి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు విద్యుత్ కార్మికుల వినతి

కుప్పం రూరల్: కాంట్రాక్టు విద్యుత్ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్‌కు వినతి పత్రం ఇచ్చారు. మంగళవారం ఆయన్ను వారు కలిశారు. జీఓ 151ను రద్దు చేయాలని, ఏపీ ఎస్‌పీడీసీ ఎల్, ఏపీ ఈపీడీ సీఎల్, ఏపీ ఈపీడీ సీఎల్‌లో పని చేస్తున్న వారికి ఇచ్చిన జీఓ 11 ప్రకారం 3 వేల మందికి పైగా ఉన్న షిప్ట్ ఆపరేటర్లకు వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు మణికంఠ, సంపత్, అభిలాష్, పురుషోత్తం, కుమార్, మునెప్ప, కుమార్, క్రిష్ణ, సంపంగి తదితరులు పాల్గొన్నారు.

మారెమ్మకు ప్రత్యేక అలంకారం



పుంగనూరు: పట్టణంలోని శ్రీ విరూపాక్షి మారెమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. వేకువజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై, నిమ్మకాయలు, నేతి దీపాలు వెలిగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవం



చెంగారెడ్డి



రామకృష్ణారెడ్డి

పుంగనూరు: పుంగనూరు నియోజకవర్గ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా గురురాజారావు వ్యవహరించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా చెంగారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణారెడ్డిని ఎన్నుకున్నారు. అలాగే అసోసియేట్ అధ్యక్షులుగా సుకుమార్, రాఘవులజెట్టి, ఉపాధ్యక్షులుగా వెంకటపతి, వెంకటముని, ఈశ్వర్ కుమార్‌రెడ్డి, లీలావతమ్మ, భరత్ భూషణ్, వేణుగోపాలరాజు, కార్యదర్శులుగా శంకర్‌రెడ్డి, రెడ్డెప్ప యాదవ్, రమేష్, రెడ్డికుమారి, మహబూబ్ సాహెబ్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా సుబ్రమణ్యం, నారాయణరెడ్డి, మహిళా కార్యదర్శిగా గంగులమ్మ ఎన్నికయ్యారు. సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని నూతన కార్యవర్గం తెలిపింది.

సీనియర్ డాక్టర్‌కు సన్మానం



డాక్టర్ హేమగిరిని సన్మానిస్తున్న సేవా కార్యకర్తలు

పలమనేరు: అంతర్జాతీయ డాక్టర్ల దినోత్సవం పురస్కరించుకుని స్థానిక సేవా కార్యకర్తలు మధు, నందగోపాల్ పట్టణంలోని సీనియర్ వైద్యులైన డాక్టర్ హేమగిరిని సన్మానించారు. ఇక్కడి ప్రజలకు ఆయన అందించిన సేవలను ఎన్నటికీ మరచిపోలేమన్నారు.

నీట్‌లో ప్రతిభ చాటిన రోహిత



పలమనేరు: పట్టణానికి చెందిన రోహిత నీట్ పరీక్షల్లో 720 మార్కులకు 715 సాధించి సత్తా చాటింది. తాను డాక్టరై సేవ చేస్తానని రోహిత తెలిపింది. తమ కుమార్తెను మంచి ఉన్నత స్థానంలో చూడాలన్నదే తమ కల అని, ఆ దిశగా నీట్‌తో పునాది వేసుకుంటోందని రోహిత తల్లిదండ్రులు సునితా మెహర్‌బాబా, రేఖా లేఖ్య హర్షం వ్యక్తం చేశారు.

డెంగీపై అవగాహన కల్పిద్దాం



రొంపిచెర్లలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

రొంపిచెర్ల: డెంగీ జ్వరంపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వ్యాధి నిరోధక అధికారి డాక్టర్ అనిల్ అన్నారు. మంగళవారం రొంపిచెర్లలో డెంగీపై విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, డెంగీ జ్వరం చాలా ప్రమాదకరమైందన్నారు. దీనిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే ప్రస్తుతం మారిన వాతావరణం, వర్షాల వల్ల అతిసారం బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని పరిశుభ్రమైన నీటినే తాగాలని, అలాగే కాచి చల్లార్చిన నీటిని వినియోగించడం మేలన్నారు. ఐదేళ్లలోపు పిల్లలకు ఓఆర్‌ఎస్, జింక్ మాత్రలను మింగించాలన్నారు. ప్రతి ఒక్కరూ చేతులు శుభ్రంగా కడుక్కోవాలన్నారు. ఈ నెల 30 వరకు డెంగీపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ దినేష్ కుమార్ నాయక్, సీహెచ్‌ఓ రాజేశ్వరి, సూపర్‌వైజర్ పంకజ, ఉపాధ్యాయులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

పెద్దపంజాణి: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పెద్దపంజాణి ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి టి. మురళి అన్నారు. మంగళవారం మండలంలోని నిడిగుంట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాల బారిన పడితే వాటికి తీసుకోవాల్సిన చికిత్స, అలాగే జ్వరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను వివరించారు. పరిసరాల శుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. ఓఆర్‌ఎస్, జింక్ టాబ్లెట్ల ఆవశ్యకత గురించి తెలియజేశారు. అనంతరం గ్రామంలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ కరుణాకర్, ఎంఎల్ హెచ్‌పీ స్వాతి, ఆశావర్కర్ జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

ఆశాల సేవలు ఎనలేనివి

పలమనేరు: వైద్యశాఖలో ఆశా వర్కర్లు ఎనలేని సేవలు అందిస్తున్నారని స్థానిక సబ్‌యూనిట్ అధికారి జయశంకర్ అన్నారు. ఆశాడే సందర్భంగా పట్టణంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెలాఖరు వరకు డెంగీ వ్యతిరేక మాసోత్సవాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. డెంగీ జ్వరం బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నివాస ప్రాంతాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఉషాకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.



పెద్దపంజాణి: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారి మురళి



పలమనేరు: పట్టణంలో ర్యాలీ చేస్తున్న ఆశావర్కర్లు

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పుంగనూరు: పుంగనూరు ఐసీడీఎస్ పరిధిలో వివిధ అంగన్‌వాడీ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీఓ రాజేశ్వరి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మండలంలోని కొండందొడ్డి, ఏతూరు, బోడేవారిపల్లె, రామ్‌నగర్‌లోని మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్త, అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అలాగే చౌడేపల్లె మండలం కాటిపేరిలో అంగన్‌వాడీ కార్యకర్త, సోమల మండలం ఫిరంగులగొట్టలో మినీ అంగన్‌వాడీ కార్యకర్త, ముండ్రివారిపల్లెలో సహాయకురాలు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పదోతరగతి పాసైన వారు ఈనెల 4 నుంచి 19వ తేదీ సాయంత్రం లోపు దరఖాస్తులు అందజేయాలని కోరారు. పూర్తి వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

సదుం మండలంలో..

సదుం: మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపరువైజర్ మల్లీశ్వరి తెలిపారు. బూరగమంద కేంద్రంలో హెల్పర్ (ఓసీ), పొలికిమాకులపల్లెలో హెల్పర్ (బీసీ–ఏ) పోస్టులు ఖాళీగా ఉన్నట్టు ఆమె చెప్పారు. స్థానికంగా నివాసం ఉన్న వివాహితులు, 10వ తరగతి పాస్ అయిన వారు, 21 నుంచి 35 సంవత్సరాల లోపు ఉన్న వారు అర్హులన్నారు. 19వ తేదీ లోపు దరఖాస్తులను పులిచెర్ల ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

రొంపిచెర్ల: రొంపిచెర్ల మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష మంగళవారం తెలిపారు. బోడిపాటివారిపల్లె, ఫజులుపేట అంగన్ వాడీ కేంద్రాలలో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నా యని తెలిపారు. వీటికి 10వ తరగతి ఉత్తీర్ణులై, 21–35 ఏళ్ల మధ్య వయస్సుఉన్న మహిళలు దర ఖాస్తు చేసుకోవాలన్నారు. బోడిపాటివారిపల్లె ఆయా పోస్టు బీసీ–బి, ఫజులుపేట ఆయా పోస్టు జనరల్‌కు కేటాయించినట్లు చెప్పారు. అంగన్‌వాడీ పరిధిలో ఉన్న మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను ఈ నెల 4 నుంచి 19 వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు పులిచెర్ల సీ డీపీఓ కార్యాలయంలో ఇవ్వాలన్నారు. దీనిని నిరు ద్యోగమహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రామకుప్పం, శాంతిపురం మండలాల్లో..

శాంతిపురం: రామకుప్పం, శాంతిపురం మండలాల్లో ఖాళీ ఉన్న ఐదు అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు ఐసీడీఎస్ సీడీపీఓ కల్పన తెలిపారు. శాంతిపురం మండలం శ్యామరాజపురం, రామకుప్పం మండలం ఎద్దులగట్టు మినీ అంగన్‌వాడీ వర్కర్ల పోస్టులు, శాంతిపురం మండలం నక్కనపల్లె, రామకుప్పం మండలం కెంపసముద్రం, మిట్టపల్లెలో అంగన్‌వాడీ ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. ఆయా పోస్టులకు స్థానికంగా ఉన్న 10వ తరగతి ఉత్తీర్ణులైన వివాహిత మహిళలు శాంతిపురం మండల సచివాలయ ఆవరణలోని తమ కార్యాలయంలో దరఖాస్తులు పొంది, పూరించిన వాటిని ఈ నెల 19వ తేదీ లోపు అందజేయాలని కోరారు.

కుప్పం, గుడుపల్లె మండలాల్లో..

కుప్పం రూరల్: కుప్పం, గుడుపల్లె మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ అరుణశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుడుపల్లె మండలంలో కనుమనపల్లె, బిసానత్తం గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్త, కుప్పం మండలంలోని అడవిబూదుగూరు, రాగిమానుమిట్ట, వెండుగంపల్లె, గుడుపల్లె మండలంలోని తిమ్మనాయనపల్లె, బిసానత్తంలో అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆమె చెప్పారు. అభ్యర్థులు ఆయా గ్రామాల్లో స్థానికంగా కాపురం ఉన్న వివాహితులై 10వ తరగతి పాసై ఉండాలన్నారు. 4వ తేది నుంచి దరఖాస్తులు కుప్పం ఎంపీడీఓ కార్యాలయంలో ఇవ్వనున్నట్లు చెప్పారు. పూరించిన దరఖాస్తులను 19వ తేది లోపు కుప్పం ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలన్నారు. మిగిలిన వివరాలకు కుప్పం ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలని తెలియజేశారు.

పలమనేరు: పలమనేరు ఐసీడీఎస్ పరిధిలోని తొమ్మిది అంగన్‌వాడీ సెంటర్లలో వర్కర్లు, హెల్పర్ పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని స్థానిక సీడీపీఓ ఇందిరా ప్రియదర్శిని మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. పూర్తి వివరాలకు స్థానికంగా తమ కార్యాలయంలో సంప్రదించాలని, ప్రాజెక్టు పరిధిలో మొత్తం 9 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలియజేశారు.

● వినూత్న నిరసన!



రాహుల్‌గాంధీ ఫ్లెక్సీ ఏర్పాటు చేసి శ్రద్ధాంజలి ఘటిస్తున్న జాగరణ సమితి సభ్యులు

కాంగ్రెస్ పార్లమెంటు సభ్యులు రాహుల్‌గాంధీ హిందువులపై పార్లమెంటులో అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని హిందూ జాగరణ సమితి వినూత్న నిరసన వ్యక్తం చేసింది. మంగళవారం రాహుల్‌కు శ్రద్ధాంజలి ఘటించింది. సంఘ నాయకులు పరమేష్, వెంకటేష్, రాజేష్, మహేష్ ఆధ్వర్యంలో రాహుల్ చిత్రపటానికి చెప్పుల హారం వేసి నివాళులర్పించారు. రాహుల్‌గాంధీ ఫొటోలను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. రాహుల్ తక్షణమే క్షమాపణ చెప్పాలని, లేకపోతే హిందువుల సత్తా చూపుతామని, కాంగ్రెస్‌ను భూస్థాపితం చేస్తామని హెచ్చరించారు. - పుంగనూరు

టీచర్లకు టీచ్ టు టూల్ శిక్షణ



సమావేశంలో ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ వెంకటరమణారెడ్డి, ఎంఈఓ తదితరులు

పలమనేరు: స్థానిక మండల వనరుల కేంద్రంలో నిర్వహిస్తున్న ఆరు మండలాలకు చెందిన టీచర్లకు టీచ్ టు టూల్ శిక్షణలో మంగళవారం ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ వెంకటరమణారెడ్డి ముఖ్య అతిథిగా మాట్లాడారు. పలు ముఖ్య విషయాలను వివరించారు. శిక్షణలోని అంశాలను ఉపాధ్యాయులు బాగా అవగతం చేసుకుని విద్యార్థులకు సులువైన పద్ధతిలో చెప్పాలన్నారు. స్థానిక ఎంఈఓలు లీలారాణి, గిరిధర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థిని అభినందిస్తున్న ఎమ్మెల్సీ

కుప్పం: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించడం గర్వకారణమని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అభినందించారు. కుప్పం ప్రభుత్వ వృత్తి విద్యా కళాశాలలో మెదటి సంవత్సరం ఇంటర్ ఫలితాల్లో 500 మార్కులకుగాను లలితారాణి 493, తబసం 492, సుస్మిత 491, పూజిత 490, సుమిత 487 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించారు. వారిని మంగళవారం ఎమ్మెల్సీ సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జ్యోతీశ్వరన్, అధ్యాపకులు ఫక్రుద్దీన్, జగదీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నెక్కుంది సమస్యలు పరిష్కరించండి

పుంగనూరు: మండలంలోని నెక్కుంది గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ చిన్నరాయల్ కోరారు. మంగళవారం గ్రామంలో సమస్యలను పరిశీలించారు. మంచినీరు, పారిశుద్ధ్యం, వీధి కుక్కలు, దోమలు ప్రబలడం, కలుషిత నీరు, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుపై తక్షణం చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు హరి, రవికుమార్, తిరుమలేశు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి శ్రీరామ సప్తాహ పూజలు

పుంగనూరు: పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఈనెల 7నుంచి వారం పాటు శ్రీరామ సప్తాహ పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నామని సంఘ అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం మంగళవారం తెలిపారు. తొలిరోజు శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద కోనేటి నుంచి గంగపూజతో పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, శ్రీరాముని ఊరేగింపు, పట్టాభిషేకం, పురాణ కాలక్షేపం నిర్వహిస్తామన్నారు. భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఐటీఐ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

శాంతిపురం: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఖాళీ ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపల్ జి.నగేష్ తెలిపారు. పదవ తరగతి పూర్తి చేసిన అభ్యర్థులు ఈ నెల 24వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, ఒరిజినల్ సర్టిఫికెట్లు, దరఖాస్తు ఫారంతో 25వ తేదీ లోపు సర్టిఫికెట్ల పరిశీలన చేయించుకోవాలన్నారు. అబకలదొడ్డి వద్ద ఉన్న ఐటీఐలో ఈ నెల 27న ఉదయం 9 గంటల నుంచి నిర్వహించే కౌన్సెలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

జిల్లా జడ్జిని కలిసిన కలెక్టర్

చిత్తూరు అర్బన్: జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావును చిత్తూరు కలెక్టర్ సుమిత్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసారు. ఇటీవల చిత్తూరు కలెక్టర్‌గా సుమిత్ కుమార్ బాధ్యతలు స్వీకరించడం విదితమే. మంగళవారం చిత్తూరులోని న్యాయస్థానాల సముదాయంలో జిల్లా జడ్జిని కలిసిన ఆయన పుష్పగుచ్ఛం అందజేశారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యలు పరిష్కరించరూ!



కలెక్టర్‌తో పలు సమస్యలపై చర్చిస్తున్న ఐక్యవేదిక నాయకులు

– కలెక్టర్‌కు ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక వినతి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునస్వామి కోరారు. మంగళవారం అసోసియేషన్ కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీని కలిసి పలు సమస్యలపై చర్చించి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని శాఖల్లో ఖాళీగా ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన దీర్ఘకాల భూ సమస్యలు పరిష్కరించాలని కోరారు. అట్రాసిటీ కేసులు పరిష్కారానికి ప్రత్యేక కార్యచరణ రూపొందించాలన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్‌ను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ధనంజయరావు, గోవిందన్, రవి, ఆర్ముగం తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణాలతో విద్యాబోధన : డీఈఓ



నరహరిపేట పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈఓ దేవరాజులు



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ

గుడిపాల: విద్యార్థులకు ఉపాధ్యాయులు ప్రమాణాలతో విద్యాబోధన చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి దేవరాజులు ఆదేశించారు. మంగళవారం మండలంలోని బొమ్మసముద్రం, నరహరిపేట ఉన్నత పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల స్టాక్ పాయింట్‌లోని స్కూల్ బ్యాగులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అలాగే వస్తున్న స్టాక్‌పై ఆరా తీశారు. కోడిగుడ్లు సైజు ఎంత పరిమాణంలో ఉన్నాయో చూశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యతా ప్రమాణాలతో మధ్యాహ్న భోజనం పెట్టాలని, టీచర్లు భోజనం తయారీని పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. హైస్కూల్ ప్లస్‌లో గత విద్యాసంవత్సరంలో సాధించిన ఫలితాలను తెలుసుకున్నారు. మొదటి సంవత్సరం 94శాతం, రెండవ సంవత్సరం 93 శాతం సాధించినట్లు తెలుసుకుని అభినందించారు. కార్యక్రమంలో ఎంఈఓలు రామ్‌నాయక్, గణపతి, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

- నిబంధనల అమలుకు అధికారుల సన్నాహం
- వాహనదారులకు అవగాహన సదస్సులు



హెల్మెట్‌ధారణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న రవాణశాఖ అధికారులు (ఫైల్)

కాణిపాకం: వాహనదారుల భద్రతకు, రోడ్డు ప్రమాదాల్లో మృతుల సంఖ్యను తగ్గించేందుకు అప్పటి కేంద్ర ప్రభుత్వం 1988లో మోటారు వాహన చట్టం కింద హెల్మెట్ ధారణ తప్పనిసరి చేసింది. 2010లో ఐక్యరాజ్య సమితి ఆదేశాల మేరకు వాహనదారుడి వెనుక కూర్చున్న ప్రయాణికులు కూడా హెల్మెట్ ధరించాలనే నిబంధనలను అమలులోకి తెచ్చింది. దేశంలో ఏటా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో వేలసంఖ్యలో ప్రజలు మృత్యువాత పడుతున్న నేపథ్యంలో ఈ చట్టం తీసుకు వచ్చింది. అయినా కేంద్ర, రాష్ట్రాల నిర్లక్ష్యం వల్ల మోటారు వాహన చట్టం సక్రమంగా అమలు కాక, ఏటా రోడ్డు ప్రమాద మృతుల సంఖ్య పెరుగుతూ వస్తోందని గతంలో ఓ న్యాయవాది ఢిల్లీ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. వాదోపవాదాల అనంతరం ఇటీవల హైకోర్టు వెలువరించిన తీర్పులో కేంద్ర మోటారు వాహన చట్టా న్ని సమర్థంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారికి నిబంధనల మేరకు ట్రాఫిక్ జరిమానాలు భారీగా విధించాలని ఆదేశించింది. అలాగే తీవ్రత, పరిస్థితులను బట్టి డ్రైవింగ్ లైసెన్సులు మూడు నెలల వరకు రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని హైకోర్టు తీర్పులో సూచించింది.

అమలు చేసేలా..చర్యలు

మోటారు వాహన చట్ట ఉల్లంఘనలపై రవాణాశాఖ తీసుకుంటున్న చర్యలేమిటని హైకోర్టు ప్రశ్నించడంతో ఆ శాఖ అధికారులు అలర్ట్ అయ్యారు. రాష్ట్రంలో మోటారు వాహన చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఏపీ లీగల్ సర్వీసెస్ ఆథారిటీకి బాధ్యతను అప్పగించింది. జిల్లాలో సుమారు 3.56 లక్షల ద్విచక్ర వాహనాలు, సుమారు 15 లక్షల లైసెన్సు జారీ అయ్యాయి. జిల్లాలోని వివిధ రహదారుల్లో ఏటా దాదాపు నాలుగు వేల వరకూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోజూ ప్రమాదాల్లో సగటున ముగ్గురు మరణిస్తున్నారని కొంతకాలం క్రితం ఒక అధ్యయనంలో తేలింది. మృతుల్లో ఎక్కువగా మోటార్ సైక్లిస్టులే ఉండటం, అందులోనే హెల్మెట్ ధరించని యువకులే ఉండటంతో నిబంధనలు కఠినంగా అమలు చేయాలని సంకల్పించారు. దీంతో కొత్త ద్విచక్ర వాహనాన్ని కొనుగోలు చేసిన రోజునే హెల్మెట్ తీసుకోవలసిన నిబంధనను రవాణాశాఖ విధించింది. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) సర్టిఫైడ్ హెల్మెట్లను ధరించాలని, తలకు సరిపోయే విధంగా సౌకర్యవంతమైన హెల్మెట్‌ను ఎంచుకోవాలని రవాణాశాఖ చెబుతోంది.

ప్రాణం విలువ గ్రహించండి



అధికారుల బలవంతంతోనే, జరిమానాలు వేస్తారనే భయంతో హెల్మెట్ ధరించడం కంటే..ప్రమాదవశాత్తు జరిగే రోడ్డు ప్రమాదాలు గుర్తించాలి. ప్రాణం విలువను తెలుసుకోవాలి. బైక్ నడిపేటప్పుడు తమకో కుటుంబం ఉందనే విషయాన్ని గుర్తించాలి. ఫ్యాషన్ పేరుతో హెల్మెట్‌కు దూరం కావద్దు. దీనిపై తరచూ వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం. అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుని హెల్మెట్ ధరించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

-నిరంజన్‌రెడ్డి, డీటీసీ, చిత్తూరు

ఇలా చేస్తే రక్ష

- ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాల నుంచి రక్షణ పొందవచ్చుననే అవగాహన పెంచాలి.
- వాహన చట్ట నిబంధనల గురించి, హెల్మెట్ ధారణ వల్ల కలిగే ప్రయోజనాలు, ధరించకుంటే కలిగే ప్రాణ నష్టాన్ని తెలియజేసేలా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.
- భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండే తేలికపాటి హెల్మెట్‌లను ఎంపిక చేసుకోవాలి.
- రోడ్లపై విధులు, వాహన తనిఖీలు నిర్వహించే పోలీసు అధికారులు తప్పనిసరిగా బాడీ కెమెరాలు ధరించేలా చర్యలు తీసుకోవాలి.
- మోటారు వాహన చట్టాన్ని ఉల్లంఘించే ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసి జరిమానా వారిపై కఠినంగా వ్యవహరించాలి.

హెల్మెట్..కవచం

- రోడ్డు ప్రమాదాల బారిన పడితే హెల్మెట్లు తల లేదా మెదడుకు తీవ్రమైన గాయం కాకుండా రక్షణ కల్పిస్తాయి.
- ముఖ కవచంతో కూడిన హెల్మెట్లు గాలి, దుమ్ము ప్రభావాన్ని తగ్గించడం ద్వారా దృశ్య మానతను మెరుగుపరచడంలో సహాయపడతాయి.
- బైకు నడుపుతున్న వాతావరణ పరిస్థితుల్లో వాంఛనీయమైన వెంటిలేషన్‌ను అందించే హెల్మెట్ సౌకర్యంగా ఉంటుంది.